జననేతకు జేజేలు | పటాన్‌చెరు రోడ్‌షోలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ అధినేత కేసీఆర్.. జైతెలంగాణ నినాదాలు చేస్తున్న ప్రజలు

ఆకాశమంత అభిమానం.. | మెదక్ జిల్లా నర్సాపూర్‌లో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ప్రసంగాన్ని హోర్డింగు ఎక్కి మరీ ఆసక్తిగా వింటున్న యువకులు

గులాబీ పూలవనం

గర్జించిన నర్సాపూర్.. పోటెత్తిన పటాన్‌చెరు.. దుండిగల్‌లో గులాబీ దండు

- ఒకే రోజు మూడు రోడ్‌షోల్లో పాల్గొన్న బీఆర్ఎస్ అధినేత
- అంతులేని అభిమానం.. అలుపులేని జననేత కేసీఆర్
- అడుగడుగునా జన నీరాజనం.. గులాబీల వర్షం

మెదక్ జిల్లా నర్సాపూర్ రోడ్‌షోలో మాట్లాడుతున్న కేసీఆర్. చిత్రంలో నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి, మెదక్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి, రాష్ట్ర లేబర్ వెల్ఫేర్ బోర్డు మాజీ చైర్మన్ దేవేందర్‌రెడ్డి

హైదరాబాద్, మే 8 (నమస్తే తెలంగాణ): నర్సాపూర్ గర్జించింది.. పటాన్‌చెరు జనం ప్రభంజనం.. దుండిగల్ గులాబీపూల వనం.. ఒకటి కాదు.. రెండు కాదు.. ఏకంగా ఒకేరోజు మూడు రోడ్‌షోలు.. ఒకదానిని మించి మరొకటి విజయవంతం.. ఉప్పొంగిన జనాభిమానం.. మొత్తంగా బుధవారం బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ రోడ్‌షో విజయవంతమైంది. బస్సుయాత్రకు ప్రజలు నీరాజనం పలికారు. మెదక్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని నర్సాపూర్, పటాన్‌చెరు, మేడ్చల్-మల్కాజిగిరి నియోజకవర్గ పరిధిలోని దుండిగల్‌లో నిర్వహించిన రోడ్ షోల్లో కేసీఆర్ పాల్గొన్నారు. సాయంత్రం ఏడు నుంచి రాత్రి 10 గంటల మధ్య జరిగిన ఆయా కార్యక్రమాల్లో కేసీఆర్ ప్రసంగించారు. బీఆర్ఎస్ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. కాంగ్రెస్ పాలనలో జరుగుతున్న అన్యాయాన్ని ప్రజలకు వివరించారు. కేసీఆర్ ఎర్రవల్లి నుంచి తన ప్రయాణాన్ని ప్రారంభించారు. గజ్వేల్ మీదుగా నర్సాపూర్‌కు చేరుకున్నారు. మార్గమధ్యంలో గజ్వేల్, తూప్రాన్, శివ్వంపేటలో జననేతను చూసేందుకు భారీగా కార్యకర్తలు, అభిమానులు తరలిరాగా.. కేసీఆర్ కాసేపు బస్సును ఆపి వారికి అభివాదం చేసి ముందుకు సాగారు. సాయంత్రం 7 గంటలకు నర్సాపూర్ చేరుకున్నారు. కిక్కిరిసిన జనసందోహం మధ్య రోడ్‌షో మొదలై.. అంబేద్కర్ సర్కిల్‌కు చేరుకున్నది. జననేతను చూసేందుకు, ఆయన ప్రసంగం వినేందుకు వేలాది సంఖ్యలో ప్రజలు చౌరస్తాకు చేరుకున్నారు. దీంతో హైదరాబాద్ వైపు, మెదక్ వైపు, తూప్రాన్ వైపు, పటాన్‌చెరువైపు వెళ్లే రహదారులన్నీ జనంతో కిక్కిరిసిపోయాయి. కేసీఆర్‌ను చూడగానే వారిలో ఉత్సాహం రెట్టింపయింది. 'సీఎం సీఎం' అన్న నినాదాలను హోరెత్తించారు. అనంతరం బస్సుయాత్ర మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా దుండిగల్ ఓఆర్ఆర్ చౌరస్తాకు చేరుకున్నది. వేలాది మంది జనం తరలివచ్చారు. అనంతరం బస్సుయాత్ర పటాన్‌చెరుకు చేరుకున్నది. కేసీఆర్ బస్సు అంబేద్కర్ సర్కిల్‌కు చేరుకోగానే జనసందోహం ఉరకలెత్తి జై కేసీఆర్ నినాదాలతో హోరెత్తించారు. మూడు చోట్ల అంతులేని ప్రజాభిమానం కనిపించగా, కేసీఆర్ అలుపులేకుండా రెట్టించిన ఉత్సాహంతో బస్సుయాత్ర, రోడ్‌షోలలో పాల్గొన్నారు.

సహకరించని పోలీసులు

కేసీఆర్ రోడ్‌షోలకు పోలీసుల నుంచి సహకారం కనిపించలేదు. ముఖ్యంగా నర్సాపూర్ చౌరస్తా నిత్యం రద్దీగా ఉంటుంది. కేసీఆర్ సభ నేపథ్యంలో వేలాది మంది తరలిరాగా, పోలీసులు ట్రాఫిక్‌ను నియంత్రించడంలో సహకరించలేదని స్థానిక నేతలు విమర్శించారు. దీంతో కార్యకర్తలే స్వయంగా ట్రాఫిక్‌ను నియంత్రించాల్సి వచ్చింది. పోలీసులు అక్కడక్కడా గుంపులుగా నిలబడి చూస్తుండటం కనిపించింది.

పంచులే పంచులు..

కేసీఆర్ ప్రసంగంలో వేసిన పంచులకు ప్రజల నుంచి పెద్ద ఎత్తున స్పందన లభించింది. ముఖ్యంగా నర్సాపూర్‌లో మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డిని ఉద్దేశించిన కేసీఆర్ మాట్లాడుతూ.. 'మహిళలకు 2,500 ఇస్తున్నామని రాహుల్‌గాంధీ అంటున్నరు. వచ్చిందా?' అని కేసీఆర్ అడగగా 'లేదు' అంటూ ప్రజలు ముక్తకంఠంతో సమాధానం ఇచ్చారు. దీంతో 'తెస్తాననే మదన్‌రెడ్డి కాంగ్రెస్‌ల సొచ్చిండంట కదా..? తేలేదా? మరీ మదన్‌రెడ్డి ఎందుకు కాంగ్రెస్‌లోకి పోయిండు' అంటూ నిలదీశారు. ఆయన్ను రెండుసార్లు ఎమ్మెల్యే చేసింది కేసీఆరే కదా. ఎవరిని ఉద్ధరిద్దామని మదన్‌రెడ్డి కాంగ్రెస్‌లోకి పోయినట్టు' అంటూ మండిపడ్డారు. వెంకట్రామిరెడ్డికి నర్సాపూర్ నుంచే 50 వేల మెజార్టీ ఇచ్చి మదనరెడ్డికి బుద్ధిచెప్పాలని కేసీఆర్ కోరగా.. 'చెప్తామంటూ ప్రజల నుంచి విశేష స్పందన వచ్చింది. ఇక దుండిగల్‌లో చేసిన ప్రసంగంలోనూ ఈటలపై పంచులు విసిరారు. మోదీ వేస్తానన్న రూ.15 లక్షలు పడ్డాయా? అని అడగగా ప్రజలు 'లేదు..' అంటూ సమాధానం ఇచ్చారు. దీంతో మీ మల్కాజిగిరిలో ఒక్కొక్కరికి రూ.30 లక్షలు వచ్చాయని ఈటల రాజేందర్ చెప్పున్నాడంటూ దెప్పిపొడిచారు. మోదీ, బీజేపీ ఎజెండాలో పేదల కష్టాలు ఉండవని, ధనికుల బాధలే ఉంటాయని కేసీఆర్ ఎద్దేవా చేశారు. ఆయా చోట్ల ప్రసంగించిన కేసీఆర్ గత బీఆర్ఎస్ హయాంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరిస్తూ, ప్రస్తుత కాంగ్రెస్ పాలనలో జరుగుతున్న అన్యాయాన్ని ప్రజలకు వివరించారు. రాష్ట్రంలో కాంగ్రెస్, కేంద్రంలో బీజేపీ పాలన వల్ల తెలంగాణకు జరుగుతున్న అన్యాయాన్ని విడమర్చి ప్రజల్లో ఆలోచనను రేకెత్తించారు.

బ్రాండ్ ఇమేజ్‌ను బొందపెట్టారు

కరెంటు కోతలు, నీళ్ల కొరతతో హైదరాబాద్ ఇమేజ్‌ను కాంగ్రెస్ ప్రభుత్వం దెబ్బతీస్తున్నదని బీఆర్ఎస్ చీఫ్ కే చంద్రశేఖర్‌రావు ఆవేదన వ్యక్తంచేశారు. కొద్దిపాటి వర్షానికే నగరంలో ఆరు నుంచి 8 గంటల పాటు విద్యుత్తు సరఫరా నిలిచిపోయిందని పేర్కొన్నారు. తాను సీఎంగా ఉన్నప్పుడు రెప్పపాటు సమయం కూడా కరెంటు పోలేదని, హైదరాబాద్‌ను పవర్ ఐలాండ్‌లా తీర్చిదిద్దామని తెలిపారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా దుండిగల్‌లో బీఆర్ఎస్ మల్కాజిగిరి పార్లమెంట్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డికి మద్దతుగా బుధవారం నిర్వహించిన రోడ్‌షోలో కేసీఆర్ మాట్లాడారు. రాష్ట్రంలో నాలుగైదు నెలల్లో పరిస్థితులు ఎంతగా తారుమారు అయ్యాయో అందరికీ తెలుసని పేర్కొన్నారు. పార్లమెంటులో బీఆర్ఎస్ ఎంపీలు డజనుమంది ఉంటే తెలంగాణ హక్కులు కాపాడతారని, రాష్ట్రానికి నిధులు తీసుకొస్తారని వివరించారు. బీజేపీ అధికారంలోకి వచ్చి పదేండ్లు అయిందని, నరేంద్రమోదీ 150 నినాదాలు ఇచ్చారని, వాటిలో ఒక్కటీ అమలు కాలేదని విమర్శించారు.

పోటెత్తిన అభిమానం.. | నర్సాపూర్ రోడ్‌షోలో అభివాదం చేస్తున్న కేసీఆర్. చిత్రంలో ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి



జనంతో మమేకమై.. | మెదక్ జిల్లా నర్సాపూర్‌లో రోడ్‌షోలో పాల్గొన్న మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు, స్థానిక నాయకులు

బీఆర్ఎస్‌కే బీసీలు జై

- కలిసొస్తున్న అభ్యర్థుల ఎంపిక
- ఆరు ఎంపీ టికెట్లు ఇచ్చిన కేసీఆర్
- 3 టికెట్లతోనే సరిపెట్టిన కాంగ్రెస్
- కేసీఆర్ పాలనలో బాగుపడ్డ బతుకులు
- పార్లమెంట్ ఎన్నికల్లో గులాబీలకే మద్దతిస్తున్న బీసీ సంఘాలు

హైదరాబాద్, మే 8 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో పార్లమెంట్ ఎన్నికల్లో టికెట్ల కేటాయింపు రాజకీయ సమీకరణాల్లో సరికొత్త మార్పునకు కారణం అవుతున్నదా? పార్టీ, అభ్యర్థి సమస్థాయిలో కీలకపాత్ర పోషించే పార్లమెంట్ ఎన్నికల్లో టికెట్ల కేటాయింపులో బీఆర్ఎస్ అనుసరించిన వ్యూహం ఆ పార్టీకి అడ్వాంటేజ్‌గా మారి కాంగ్రెస్, బీజేపీలకు శరాఘాతంగా పరిణమించనున్నదా? టికెట్ల కేటాయింపులో కేసీఆర్ చూపిన వ్యూహచతురత వల్ల రెండు జాతీయ పార్టీలు ఆత్మరక్షణలో పడ్డాయా? అంటే అవుననే చెప్తున్నారు రాజకీయ పరిశీలకులు. రాష్ట్రంలో ఉన్న మొత్తం 17 లోక్‌సభ స్థానాల్లో కేసీఆర్ ఈసారి ఆరుగురు బీసీలకు టికెట్లు కేటాయించారు. చేవెళ్ల పార్లమెంట్ స్థానాన్ని కాసాని జ్ఞానేశ్వర్ (ముదిరాజ్), నిజామాబాద్ టికెట్‌ను బాజిరెడ్డి గోవర్ధన్ (మున్నూరుకాపు), జహీరాబాద్ టికెట్‌ను గాలి అనిల్‌కుమార్ (మున్నూరుకాపు), సికింద్రాబాద్ టికెట్‌ను తీగుళ్ల పద్మారావుగౌడ్ (గౌడ్), భువనగిరి టికెట్‌ను క్యామ మల్లేశ్ (యాదవ), హైదరాబాద్ స్థానాన్ని గడ్డం శ్రీనివాస్‌యాదవ్ (యాదవ) ఇలా ఆరు స్థానాల్లో ఆరుగురు బలమైన సామాజికవర్గాలకు చెందిన నాయకులకు కేటాయించారు. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ప్రతి మూడు అసెంబ్లీ స్థానాల్లో ఒక స్థానాన్ని బీసీలకు కేటాయిస్తామంటూ పీసీసీ అధ్యక్షుడి హోదాలో ప్రకటించిన రేవంత్‌రెడ్డి.. ఆ మాట నిలబెట్టుకోకపోవడంతో అప్పుడు కాంగ్రెస్ పార్టీకి బీసీల నుంచి తీవ్రమైన వ్యతిరేకత ఎదురైంది. దీంతో పార్లమెంట్ ఎన్నికల్లో తప్పకుండా ఈ లోటును భర్తీచేస్తామని కాంగ్రెస్ పార్టీ నమ్మబలికింది. తీరా మూడు స్థానాలను మాత్రమే బీసీలకు కేటాయించింది. సికింద్రాబాద్ లోక్‌సభ స్థానాన్ని దానం నాగేందర్ (మున్నూరుకాపు)కు (అదీ బీఆర్ఎస్ నుంచి పిలిచి మరీ), మెదక్ నుంచి నీలం మధు (ముదిరాజ్)కు, జహీరాబాద్ స్థానాన్ని సురేశ్‌షెట్కర్ (లింగాయత్)కు కేటాయించి చేతులు దులుపుకున్నది. ఇక బీజేపీ బీసీలకు ఐదు టికెట్లు ఇచ్చింది. ఇందులో నిజామాబాద్, మల్కాజిగిరి, కరీంనగర్ స్థానాల్లో అభ్యర్థులుగా ఉన్న ధర్మపురి అర్వింద్, ఈటల రాజేందర్, బండి సంజయ్ ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో పరాభవాన్ని చవిచూశారు. ఈ ముగ్గురిని ఓడించింది బీఆర్ఎస్ పార్టీయే కావడం విశేషం. మిగిలిన రెండు స్థానాల్లో భువనగిరి నుంచి పోటీచేస్తున్న బూర నర్సయ్యగౌడ్, జహీరాబాద్ నుంచి బరిలో నిలిచిన బీబీ పాటిల్ కూడా పూర్వాశ్రమంలో బీఆర్ఎస్‌వారే కావడం గమనార్హం. దీంతో బీజేపీ సొంతంగా బీసీ నాయకులను తయారుచేసుకోలేదని, ఒకవేళ ఉన్నా వారికి అంతపెద్దగా గుర్తింపులేదనే చర్చ సాగుతున్నది. బీజేపీకి పైన లీడర్ బలం లేకపోవడం, క్షేత్రస్థాయిలో క్యాడర్ లేకపోవడం వల్లే అసెంబ్లీ ఎన్నికల్లో దాదాపు 60కి పైగా స్థానాల్లో డిపాజిట్లు కోల్పోయిందని రాజకీయ పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. ఈ పరిణామాల నేపథ్యంలో రాష్ట్రంలో గత పదేండ్ల అనుభవాన్ని, ప్రస్తుత టికెట్ల కేటాయింపు విషయంలో కేసీఆర్ చూపించిన దార్శనికత కాంగ్రెస్, బీజేపీల్లో కొరవడ్డ కారణంగా రాష్ట్రంలోని బీసీలు ఏకపక్షంగా బీఆర్ఎస్ వైపు వచ్చేశారని ఉదహరిస్తున్నారు.

మహనీయుల ఘనత తరాలకు...

తెలంగాణ రైతాంగ సాయుధపోరాట వీరుల చరిత్ర భవిష్యత్తు తరాలకు వారధిగా నిలిపిన ఘనత కేసీఆర్‌కే దక్కింది. చాకలి ఐలమ్మ, దొడ్డి కొమురయ్య, సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ జయంతులను ప్రభుత్వమే అధికారికంగా నిర్వహించేలా శాశ్వత చర్య తీసుకున్న బీఆర్ఎస్ పార్టీ వైపు బీసీలు నిలబడుతున్నారు. తెలంగాణ సిద్ధాంతకర్త ఆచార్య కొత్తపల్లి జయశంకర్, కొండా లక్ష్మణ్‌బాపూజీ పేరు శాశ్వతంగా నిలిచి ఉండేలా, వారి స్ఫూర్తిని భవిష్యత్తు తరాలు గుర్తుంచుకునేలా చేసిన ఘనత కేసీఆర్‌కు దక్కింది.

ఓటు బ్యాంకు పార్టీలకు గుణపాఠం

రాష్ట్రంలో 1.88 కోట్ల జనాభా ఉన్న బీసీలను కాంగ్రెస్, బీజేపీ రెండు పార్టీలు ఓటు బ్యాంకుగా మార్చుకున్నాయే తప్ప ఏనాడూ తమ బాగోగులు పట్టించుకోలేదని బీసీలు ఆ పార్టీలపై ఆగ్రహంతో ఉన్నారు. ఏడున్నర దశాబ్దాలుగా తమ బాగోగులు పట్టించుకోని ఈ రెండు పార్టీలకు ఈ పార్లమెంట్ ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్తామని హెచ్చరిస్తున్నాయి. కుల వృత్తులకు జీవం పోసిన రాష్ట్రంగా తెలంగాణను తీర్చిదిద్దిన కేసీఆర్ వెంటే తాము ఉంటామని బీసీ సంఘాల ప్రతినిధులు తెగేసి చెప్తున్నారు. తమది రాజకీయ పోరాటం కాదని, ఆత్మగౌరవ పోరాటమని బీసీలు స్పష్టం చేస్తున్న సన్నివేశాలు అనేక చోట్ల దర్శనమిస్తున్నాయి.

బడుగుల రాష్ట్ర సమితిగా కీర్తి

బీఆర్ఎస్ పార్టీని బడుగుల రాష్ట్ర సమితిగా రాష్ట్రంలోని వెనుకబడిన కులాలు కీర్తిస్తున్నాయి. రాష్ట్రంలో గవర్నర్ తరువాత ప్రోటోకాల్ పదవులైన శాసనమండలి చైర్మన్ (స్వామిగౌడ్), శాసనసభ స్పీకర్ (సిరికొండ మధుసూదనాచారి) పదవులే కాకుండా అనేకమందిని ఎంపీలుగా, ఎమ్మెల్సీలుగా, ఎమ్మెల్యేలు గా చేసిన ఘనత కేసీఆర్‌కే దక్కిందని బీసీలు గుర్తుచేస్తున్నారు. పార్టీలో అత్యంత కీలకమైన సెక్రటరీ జనరల్ స్థానాన్ని బీసీ వర్గాలకే కేసీఆర్ కేటాయిస్తూ ఆ వర్గాన్ని అందలం ఎక్కించడంలో వ్యూహచతురతను చాటుకున్నారు. బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులను ఎంపిక చేసిన తీరే పార్లమెంటు ఎన్నికల్లో విజయదుందుభి మోగించే తొలి మెట్టు అయిందని, క్షేత్రస్థాయిలో ఆ పార్టీ అభ్యర్థులకు వస్తున్న ఆదరణే అందుకు నిదర్శనం అని సామాజిక విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

నర్సాపూర్ నుంచే మార్పు | బుధవారం రాత్రి నర్సాపూర్‌లో నిర్వహించిన కేసీఆర్ రోడ్ షోలో మాకు మళ్లీ కేసీఆరే సీఎం కావాలంటూ ప్లకార్డులు ప్రదర్శిస్తున్న ప్రజలు

పటాన్‌చెరు.. గులాబీ హోరు | పటాన్‌చెరులోని అంబేద్కర్ చౌరస్తాలో బుధవారం నిర్వహించిన కేసీఆర్ రోడ్ షోకు పెద్దసంఖ్యలో తరలివచ్చిన ప్రజలు